విజయవాడ 27-10-2015 5




ఆర్చరీ.. అంటే ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్రీడ.
ఒంటి కన్నుతో ప్రపంచాన్ని జయించేలా చేసే ఓ క్రీడాద్భుతం
మన భాషలో చెప్పాలంటే ఆర్చరీ అంటే విలువిద్య. బాణాన్ని
గురిపెట్టి లక్ష్యాలను సంధించడం. ఛేధించడం.!!
గురిపెట్టడం వేరు. గురి చూసి కొట్టడం వేరు. ఈ రెండింటికీ
చాలా తేడా ఉంది.
గురిపెడితే.. ఆ గురి కుదరకపోతే లక్ష్యం తప్పొచ్చు.
గురి చూసి కొడితే మాత్రం .. కచ్చితంగా ఒకటోసారో..
రెండోసారో.. లక్ష్యాన్ని చేరవచ్చు.
అలా లక్ష్యాన్ని చేరుకునే విషయంలో..మన తెలుగమ్మాయి
జ్యోతి సురేఖ మన దేశపు మువ్వెన్నల జెండా ఖ్యాతిని
నిలబెడుతోంది.
మొక్కవోని విశ్వాసంతో దేశం కోసం విలువిద్యను ఆసరా
చేసుకుని ఒక్కొక్క లక్ష్యాన్ని ఛేధిస్తోంది.
ఆర్చరీలో జ్యోతి అంటే ఇప్పుడు వెలుగుతున్న క్రీడాజ్యోతి.
భారతీయ విలువిద్య క్రీడలో వర్ధ, ప్రవర్ధమానమవుతున్న జ్యోతి
సురేఖా తాజా విజయాల
'జీవన' గమనం మీకోసం

# గురితప్పని తెలుగమ్మాయి

తొలిరోజుల్లో చేపపిల్లలా ఈతకొట్టిన ఈ పాప.. ఎందుకనో విల్లంబులు, బాణాలు చేతబట్టింది. బాణం పట్టింది మొదలు గురి తప్పకుండా సాగిపోతూనే ఉంది. ఎవరికోగానీ అబ్బని విలువిద్యలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో దూసుకుపోతున్న జ్యోతిరేఖ క్రీడా ప్రయాణంలో అలుపెరుగని విశేషాలెన్నో

**అమ్మాయికాదు.. ఆర్చరీ**

13 సంవత్సరాల వయసులో తొలిసారిగా అంతర్జాతీయ వేదికపై మెరిసిన జ్యోతి, అప్పటినుండి వెనుదిరిగి చూడలేదు. 2009లో టైజునాలో మెక్సికన్ గ్రాండ్ టోర్నీలో, అండర్-19 విభాగంలో ఒలింపిక్ రౌండ్లో స్వర్ణ పతకం గెల్చుకుంది. అదే వేదికపై మరో మూడు రజత పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సొంతం చేసుకుని తన ప్రతిభను ప్రదర్శించింది. 2011లో టెహరానులో జరిగిన ఆసియా ఆర్చరీ ఛాంపియనుషిప్ పోటీలలో మహిళా కాంపౌండ్ టీం సభ్యురాలిగా కాంస్య పతకం గెల్చుకుంది. 2013 లో చైనాలోని "వుక్సి" వేదికగా సాగిన ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలలో కాంపౌండ్ జూనియర్ ఉమన్ కాంపౌండ్ మిక్సెడ్ డబుల్స్ విభాగాలలో కాంస్య పతకాలు సాధించింది. 2014 సెప్టెంబరులో, దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో జరిగిన ఆసియా క్రీడలలో భారత ఆర్చరీ మహిళా జట్టు సభ్యురాలిగా కాంస్య పతకం స్వంతం చేసుకుంది.

**గురిపెడితే.. బంగారమే**

గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన వెన్నం సురేంద్ర కుమార్, శ్రీదేవి దంపతుల కుమార్తె జ్యోతి సురేఖ. కుటుంబంతో ప్రస్తుతం విజయవాడలో స్థిరపడింది. క్రీడలపట్ల ఆసక్తి ఉండటంవల్ల చిన్నప్పటి నుండి సురేఖకు ఈతలో శిక్షణ ఇచ్చారు. జ్యోతి తన నాలుగు సంవత్సరాల వయసులోనే ఈత విన్యాసాలతో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు సంపాదించడం విశేషం. ఐదు కి.మీ. దూరంలో కృష్ణా నదిని మూడు గంటల ఇరవై నిమిషాల ఎనిమిది సెకన్లలో ఈది, రికార్డు సృష్టించింది. ఆ క్రమంలోనే ఆర్చరీ క్రీడ అంటే మక్కువ పెంచుకుని దివంగత క్రీడాకారుడు లెనిన్ ఆధ్వర్యంలో ఆర్చరీ నేర్చుకుని పలు జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. బంగారు పతకాలు సాధిస్తూ తెలుగమ్మాయిల క్రీడా ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటుతోంది జ్యోతి సురేఖ.

**మువ్వెన్నల సాక్షిగా**

2015, మే-21 నుండి 24 వరకు, పాటియాలాలో పంజాబ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయ విశ్వవిద్యాలయాల విలువిద్య పోటీలలో పాల్గొని, జ్యోతి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రపంచ విశ్వవిద్యాలయాల విలువిద్య పోటీలకు ఎంపికై, దక్షిణ కొరియా దేశంలోని గ్వాంగ్ జూ నగరంలో నిర్వహించిన ప్రపంచ విశ్వవిద్యాలయాల విలువిద్య పోటీలలో పాల్గొంది. గ్వాంగ్ జూ క్రీడా గ్రామంలో నిర్వహించిన వరల్డ్ యూనివర్సైడ్ గేమ్స్-2015 ప్రారంభ వేడుకలలో భారత జట్టుకి నాయకత్వం వహించి, గౌరవ వందనం చేసింది. ఈ అరుదైన గౌరవం దక్కిన తొలి రాష్ట్ర క్రీడాకారిణిగా పేరు సంపాదించింది. గ్వాంగ్ జూ క్రీడాగ్రామంలో జరిగిన ఈ వేడుకలలో 33 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. 2015, జులై-4 నుండి 8 వరకు నిర్వహించిన ఈ పోటీలలో పాల్గొన్న సురేఖ, మహిళా కాంపౌండ్ విలువిద్య పోటీలలో, వ్యక్తిగత ఒలింపిక్ పోటీలలో ఐదవ స్థానం, మిక్సిడ్ విభాగంలో రజత పతకం, జట్టు విభాగంలో ఏడవ స్థానంలో నిలిచింది. ర్యాంకిగ్స్‌లో 720 పాయింట్లకుగాను 682 పాయింట్లు సాధించి ఏనిమిదవ వ స్థానంలో నిలిచింది. డెన్మార్క్ దేశంలో 2015, జులై-26 నుండి ఆగష్టు-2 వరకు నిర్వహించిన ప్రపంచ విలువిద్యా పోటీలలో పాల్గొంది. ఈ పోటీలలో ఈమె ఫైనల్సుకు చేరుకుంది. 2015, అక్టోబరు-15న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌లో నిర్వహించిన 36వ జాతీయ సీనియర్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలలో కాంపౌండ్ ర్యాంకింగ్ రౌండులో 720 పాయింట్లకుగాను 686 పాయింట్లు సాధించి, స్వర్ణ పతకం చేజిక్కించుకుంది.



**ప్రపంచ పతకమే లక్ష్యంగా..**

ప్రస్తుతం పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆర్చరీలో పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధిస్తోంది జ్యోతి. అయితే 2017 మెక్సికోలో జరుగనున్న సీనియర్ వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధనే లక్ష్యంగా కృషి చేస్తోంది. జాతీయ సీనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో గత నాలుగు సంవత్సరాలలో చూస్తే మూడవ సారి జ్యోతి సురేఖ ఛాంపియన్‌షిప్ సాధించింది. ప్రస్తుతం ఆర్చరీ కాంపౌండ్ ఉమెన్ ర్యాంకింగ్‌లో 14వ స్థానంలో కొనసాగుతోంది. నవంబరు 2 నుండి 7వ తేదీ వరకూ బ్యాంకాంగ్‌లో జరుగనున్న ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్న జ్యోతిసురేఖ ప్రస్తుతం బిటెక్ కంప్యూటర్ సైన్సు విద్యార్థి.

> ‘పాటియాలాలో పంజాబ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయ విశ్వవిద్యాలయాల విలువిద్య పోటీలలో పాల్గొని, జ్యోతి ప్రథమ స్థానంలో నిలిచింది.’



> ‘13 సంవత్సరాల వయసులో తొలిసారిగా అంతర్జాతీయ వేదికపై మెరిసిన జ్యోతి, అప్పటినుండి వెనుదిరిగి చూడలేదు.’

**చిన్నవయసులోనే గురితప్పని లక్ష్యంతో**

దూసుకుపోతున్న జ్యోతిసురేఖ రానున్న రోజుల్లోనూ ప్రపంచ స్థాయి లక్ష్యాలను అవలీలగా సాధించి, ఛేదించి దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరుకుందాం!

-జీవన డెస్క్